# చెరువులో డంపింగ్

- అధ్వానంగా మారిన ఎల్లయ్య చెరువు పరిసరాలు
- ట్రాక్టర్లలో శిథిలాలు, చెత్తను డంప్ చేస్తున్న వైనం
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు


ఎల్లయ్య చెరువులో వేసిన మట్టి, వ్యర్థ పదార్థాలు

బాన్సువాడ : బాన్సువాడ పట్టణ నడిబొడ్డున ఉన్న ఎల్లయ్య చెరువులో కొంత స్థలాన్ని వీక్లీ మార్కెట్‌కు కేటాయించి చెరువు చుట్టూ మోరం వేసి సీసీ రోడ్డు కూడా నిర్మించారు. బాన్సువాడ మున్సిపాలిటీ కాగానే ఎల్లయ్య చెరువును అభివృద్ధి చేశారు. అయితే కొయ్యగుట్ట సమీపంలో డంపింగ్ యార్డ్‌కు స్థలం కేటాయించి చెత్తను అక్కడే వేయాలని మున్సిపల్ అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. కాని పట్టణంలో కూలగొట్టే భవనాల శిథిలాలతో పాటు చెత్తా చెదారం, వ్యర్థాలను కట్టపై డంప్ చేస్తుండడంతో పరిసరాలు కంపు కొడుతున్నాయని వాహనదారులు, సంతకు వచ్చే ప్రజలు చెబుతున్నారు. సంతకు వచ్చే ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. సుందరీకరణలో భాగంగా చెరువు కట్టను వెడల్పు చేయడంతో పాటు సీసీ రోడ్డు నిర్మించారు. ఉదయం వేళల్లో వాకింగ్‌కు వెళ్లే వారు గత కొన్ని రోజులుగా శిథిలాలు, వ్యర్థాలు డంప్ చేయడంతో దుర్వాసన వస్తోందంటున్నారు. ఈ దుర్వాసనతో టీచర్స్ కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు.

**ఎక్కడినుంచో తీసుకొచ్చి..**

చెత్త, వ్యర్థాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భవన శిథిలాలను తెచ్చి కట్టపై, చెరువు లోపల డంప్ చేస్తున్నారని స్థానికులు అంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ. కోట్లల్లో నిధులు ఖర్చు చేసి చెరువును అభివృద్ధి చేస్తే చెత్తను ఎలా డంప్ చేస్తారని ప్రజలు అంటున్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు దీనిపై దృష్టి సారించకపోవడంతోనే చెత్తను, వ్యర్థాలను డంప్ చేస్తున్నారని పేర్కొంటున్నారు. ప్రధాన రహదారుల పక్కన, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే అధికారులు జరిమాన విధిస్తున్నారని, చెరువులో, కట్టపై చెత్తను డంప్ చేయకుండా కట్టడి చేస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## క్లుప్తంగా

### సీసీరోడ్డు పనుల పరిశీలన



బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లం క్యాంపు దుర్గమ్మ కాలనీలో కొనసాగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆదివారం రైతు బంధు మండల డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. రూ. 18 లక్షల నిధులతో ప్రధాన సీసీరోడ్డు వేయడం జరిగిందని, మరో రూ. 10 లక్షల స్పెషల్ ఫండ్స్‌తో ఇంటర్నల్ సీసీరోడ్లు వేస్తున్నారన్నారు. తడ్కపల్లి సాయిలు, గాజుల మహిబూబ్, మంజూర్, మంద కాశీరాం, జంగం సంగయ్య, కాశీరాం,రఫీఖ్,సంజీవులు తదితరులు ఉన్నారు.

### ‘కస్తుర్బా’ రోడ్డుకు మరమ్మతులు చేయాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల వరకు ఉన్న రోడ్డును తారురోడ్డుగా మార్చాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. రెండేళ్ల క్రితం వేసిన ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో టీచర్లకు, పిల్లలకు, తల్లిదండ్రులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. విద్యుత్‌దీపాల సౌకర్యం కూడా కల్పించాలని కోరుతున్నారు.

### బెల్ట్‌షాప్‌ను మూసేయించాలి



భిక్కనూరు : గ్రామంలోని బెల్ట్‌షాప్‌ను మూసివేయించాలని గ్రామాభివృద్ధి కమిటీకి గ్రామ కాంగ్రెస్ నేతలు ఆదివారం వినతి పత్రంను అందజేశారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శివలింగం, ప్రధాన కార్యదర్శి కుర్రి బాల్‌కిషన్, కోశాధికారి తిర్మలేశ్‌ల ఆధ్వర్యంలో సమావేశమైంది. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మూర్తి నరేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు వీడీసీ ప్రతినిధులు గ్రామంలో బెల్ట్‌షాపు ఉండటం వల్ల కలుగుతున్న ఇబ్బందుల గురించి వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ప్రకాష్‌గౌడ్, బాలయ్య, రవి, ఆమెన్, నీల స్వామి, నర్సింలు, ఆనంద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### కాచాపూర్‌లో శిలాఫలకం ధ్వంసం



భిక్కనూరు : మండలంలోని కాచాపూర్‌లోని డబుల్‌రూమ్‌లకు సంబంధించిన శిలాఫలకంను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం వేకువజామున ధ్వంసం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 50 డబుల్‌రూమ్‌లను నిర్మించారు. మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ శంకుస్థాపన చేశారు. మాజీ ఎంపీపీ తొగరి సుదర్శన్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్ నేతలు అక్కడి వెళ్లి పరిశీలించారు. ఈ విషయమై భిక్క నూరు పోలీసులకు సమాచారం అందించారు.

### వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



బాన్సువాడ : బాన్సువాడలో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరానికి అనుహ్య స్పందన లభించింది. లయన్స్‌క్లబ్ ఆఫ్ బాన్సువాడ, యశోద ఆస్పత్రి సికింద్రాబాద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరంలో గుండె, ఎముకలు, సాధారణ వ్యాధులకు సంబంధించి 140 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. 140 రోగులకు ఉచితంగా పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో లయన్స్ క్లబ్ బాన్సువాడ అధ్యక్షులు దుద్దాల అంజిరెడ్డి, కార్యదర్శి కాచం శ్రీనివాస్, కోశాధికారి వెంకటరమణ, లయన్స్ క్లబ్ సభ్యులు ఉన్నారు.

### జర్నలిస్టుల కార్యవర్గం ఎన్నిక

నిజాంసాగర్(జుక్కల్): ఉమ్మడి నిజాంసాగర్ మండల జర్నలిస్టుల కార్యవర్గాన్ని ఆదివారం ప్రాజెక్టు గుల్‌దస్తా వద్ద ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జర్నలిస్టు సంఘం మండల అధ్యక్షుడిగా దాస లక్ష్మణ్‌దాస్, ఉపాధ్యక్షులుగా సాయిలు, ప్రధాన కార్యదర్శిగా కాశీ, సహాయ కార్యదర్శిగా శ్యాం, కోశాధికారిగా షరీఫ్, సలహాదారులుగా సీనియర్ జర్నలిస్టులు సల్ల ఆశన్న, సీహెచ్ బాలరాజు, రెడ్డిశెట్టి బాస్కర్, కార్యవర్గ సభ్యులుగా రాజమల్లయ్య, హల్లాజి, రాజేందర్‌రెడ్డి, రహీంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## జహీరాబాద్ ఎంపీ స్థానంపై దృష్టి పెట్టాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి


రామారెడ్డిలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

రామారెడ్డి (ఎల్లారెడ్డి) : రానున్న పార్లమెంట్ ఎన్నికలలో జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ జెండాను ఎగురవేయాలని కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రం రామారెడ్డిలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.....ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలో ఇంటింటికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరించాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షురాలు అరుణతార, మండల అధ్యక్షుడు గడ్డం ప్రసాద్, ఈశ్వర్, సందీప్, రమేష్, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిలో మాట్లాడుతూ..

ఎల్లారెడ్డి : జహీరాబాద్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు ప్రతికార్యకర్త కష్టపడి పనిచేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిలో బీజేపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అరుణతార, వైస్ ఎంపీపీ నర్సింలు, మండల పార్టీ అధ్యక్షులు ఎస్ఎన్‌రెడ్డి, రాజేష్, శ్రీనివాస్‌రెడ్డి, పరంధాములు ఉన్నారు.

## డిస్టిలరీ భూమిని అప్పగించాలని ఆందోళన


టేక్రియాల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కామారెడ్డి అర్బన్ : టేక్రియాల్ గ్రామ అవసరాల కోసం కేటాయించిన భూమిని కౌన్సిలర్ జే.శంకర్ రావు ఇవ్వడం లేదని గ్రామస్తులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. కామారెడ్డి పట్టణ పరిధిలోని టేకిర్యాల డిస్టిలరీ భూమి యజమాని మల్లేశ్‌గౌడ్ బీడీకార్మికుల ఇళ్ల కోసం 2007లో కేటాయించిన స్థలంలో 1600 వందల గజాల స్థలం గ్రామానికి చెందిన 13వ వార్డు కౌన్సిలర్ జే.శంకర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ కుంటి ఆంజనేయులు పేర్లపై చేశారని, ప్రస్తుతం వారి అధీనంలోని భూమిని గ్రామ అవసరాల కోసం అప్పగించాలని కోరగా కుంటి అంజనేయులు ముందుకొచ్చిన కౌన్సిలర్ శంకర్‌రావు మొండిగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. గతంలో టేకిర్యాల సర్పంచ్‌గా ఉండి, ప్రస్తుతం మున్సిపాల్ కౌన్సిలర్‌గా ఉన్న శంకర్‌రావు స్థలం విషయంలో ఎన్నిసార్లు విన్నవించిన అప్పగించడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. కౌన్సిలర్ శంకర్‌రావు మొండి వైఖరికి వ్యతిరేకిస్తూ ఆందోళన తీవ్రం చేస్తామని టేకిర్యాల గ్రామస్తులు ప్రకటించారు.

### గుల్లాతండాలో తాగునీటి ఎద్దడి



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలంలోని గుల్లా తండాలో జీపీల్లో నాలుగురోజు నుంచి గిరిజన ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. జీపీలో రక్షితట్యాంకు నీటిని సరఫరా చేసే బోరు మోటార్ చెడిపోవడంతో నాలుగురోజుల నుంచి కుళాయిల ద్వారా నీటిసరఫరా నిలిచిపోయింది. చెడిపోయిన బోరు మోటార్‌కు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. జీపీ పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తుండటంతో నీటికోసం మహిళలు పోటీ పడుతున్నారు.

### ఎమ్మెల్సీకి సన్మానం



దోమకొండ : ఎమ్మెల్సీగా నియమితులైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆదివారం దోమకొండ జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ సన్మానించారు. మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించినట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు నిమ్మ శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సీతారం మధు, పందిరి మధుసూధన్‌రెడ్డి, కదిరె గోపాల్‌రెడ్డి ఉన్నారు.

### బాధ్యతలు స్వీకరించిన ఎస్సై



లింగంపేట(ఎల్లారెడ్డి) : లింగంపేట ఎస్సైగా గోలి చైతన్యకుమార్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ నుంచి బదిలీపై లింగంపేటకు వచ్చారు. లింగంపేట కాంగ్రెస పార్టీ సీనియర్ నాయకులు నారాగౌడ్, ఎల్లమయ్య, ఆశోక్, సాయికుమార్, రవి, గంగారెడ్డి తదితరులు సన్మానించారు.

### పాలకవర్గానికి ఘన సన్మానం



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మంగ్లూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గైని. స్వప్న, ఉప సర్పంచ్ దత్తు, వార్డు సభ్యులను ఆదివారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఐదేళ్ల కాలం పాటు గ్రామ పంచా యతీకి వారు అందించిన సేవలను గ్రామస్థులు కోనియాడారు.

### సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డికి సన్మానం



లింగంపేట(ఎల్లారెడ్డి) : ప్రముఖ సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డిని ఆదివారం లింగంపేట మండల ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డి ప్రజలకు చేస్తున్న సేవలను కొనియాడారు. ఆయన సమాజానికి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంపీ, పీఎంపీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణ, నక్క శ్రీను, మండల వైద్యులు బాలకిషన్‌గౌడ్, విఠల్, ఓంప్రకాష్, భీంరాజు, చంద్రశేఖర్ తదితరులున్నారు.

### శివభిక్ష అన్నదాన సత్రానికి విరాళం



కామారెడ్డి అర్బన్ : పట్టణ పరిధిలోని దేవునిపల్లి శివాలయం శివభక్తబృందం శివభిక్ష అన్నదానసత్రం కోసం భక్తుడు డీకొండ నవీన్-లత ఆదివారం రూ.51,111 లు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శివభక్తబృందం కమిటీ ప్రతినిధులు నిట్టు నారాయణరావు, చిన్నోల గోపాలరావు, లద్దూరి లక్ష్మీపతి, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### మేరు సంఘం కార్యవర్గం ఎన్నిక



లింగంపేట(ఎల్లారెడ్డి) : లింగంపేట మండల మేరు సంఘం కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా మేరు సంఘం అధ్యక్షుడు సరికొండ నారాయణాధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడిగా కొట్టూరి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు కొట్టూరి దుర్గయ్య, ప్రభాకర్, పోచయ్య, సాయిలు, కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కొట్టూరి సత్యప్రసాద్, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, అంజయ్య, భానుచందర్, హరిబాబు, ప్రసాద్, నిర్వాహక కార్యదర్శులు శంకర్, లక్ష్మీనర్సయ్య, పరంధాములు, నారాయణ, సత్యనారాయణ, కోశాధికారి సంఘ లక్ష్మీనారాయణను ఎన్నుకున్నారు.

## గ్రామాల్లో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు


దేశాయిపేట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు


లింగాయపల్లిలో మొక్క నాటుతున్న వలంటీర్లు

బాన్సువాడ రూరల్ : మండలంలోని దేశాయిపేట్, సోమేశ్వర్, కొల్లూర్, నాగారం గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ శిబిరాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన వలంటీర్లు దేశాయిపేట్ గ్రామంలో ప్రోగ్రామం ఆఫీసర్ యాదాగౌడ్ ఆధ్వర్యంలో, సోమేశ్వర్ గ్రామంలో ప్రోగ్రాం ఆఫీసర్ రుక్మిణి ఆధ్వర్యంలో, కొల్లూర్, నాగారం గ్రామాల్లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ మద్ది గంగాధర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతున్నాయి.

**‘రాజ్యాంగం, చట్టాలపై అవగాహన ఉండాలి’**

కామారెడ్డి అర్బన్ : రాజ్యాంగం, చట్టాల గూర్చిన కనీస అవగాహన ప్రతిపౌరుడు కలిగి ఉండాలని సీనియర్ న్యాయవాది జి జగన్నాథం అన్నారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జాతీయ సేవా పథకం శీతకాల ప్రత్యేక శిబిరం కామారెడ్డి మండలంలోని లింగాయపల్లిలో 4 రోజులుగా నిర్వహిస్తున్నారు. కళాశాల అకడమిక్ సమన్వయకర్త వి.శంకర్, ప్రోగ్రాం అధికారి జి చంద్రశేఖర్‌గౌడ్, లింగాయపల్లి హెడ్‌మాస్టర్ గోపాలరావు పాల్గొన్నారు.

## ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు


విజేతలకు జ్ఞాపికలను అందజేస్తున్న నిర్వాహకులు

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లికి చెందిన 12, 35వ వార్డు సభ్యులు పి కృష్ణాజీరావు, కాసర్ల గోదావరి సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజులుగా కాసర్ల విహార్‌లో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు నిర్వహించి విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. విజేతలకు రూ.10వల నగదు జ్ఞాపికలిచ్చారు. ప్రథమ బహుమతి రాఘవేంద్రరావు, స్వామిరెడ్డి, ద్వితీయ బహుమతి రామకృష్ణ, విష్ణు గెలుపొందారు. బీఆర్ఎస్ నాయకుడు కాసర్ల స్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల రవీందర్, ముకుంద్‌రావు తదితరులున్నారు.

### నూతన కార్యవర్గం



రామారెడ్డి (ఎల్లారెడ్డి) : రామారెడ్డిలో ఆజాద్ హిందు యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివార ఎన్నుకున్నారు. స్థానిక ప్రగతి పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకోగా అధ్యక్షుడిగా గుర్జకుంట స్వామి, ఉపాధ్యక్షుడిగా బండకింది రమేశ్, సాగర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బోల్లం శ్రీనివాస్, సహాయ కార్యదర్శి శివారం శ్రీధర్, సహాయ కార్యదర్శి నోముల సందీప్, కోశాధికారిగా డిష్ రవిని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను వ్యవస్థాపక అధ్యక్షులు మహ్మద్ కాజా, ఈశ్వర్ రాజేశ్వర్, రవీందర్ గౌడ్, లింబాద్రి ఆధ్వర్యంలో ఎన్నుకొని భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

### నేడు నిజాంసాగర్ మండల సర్వసభ్య సమావేశం

నిజాంసాగర్(జుక్కల్) : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగనుంది. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మండల సభకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మూణ్నెల్లకొకసారి ఒక్కసారిగా మండల సర్వసభ్య సమావేశం జరగడం ఈసారి సమావేశానికి సర్పంచులు దూరమయ్యారు. ప్రత్యేక అధికారులు సమావేశానికి హాజరవుతున్నారు.

**ఉచిత వైద్య శిబిరం**

దోమకొండ : మండల కేంద్రంలోని ఆనంద్‌భవన్‌లో ఆదివారం గడికోట ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన వైద్యులు షరీఫ్ ఆధ్వర్యంలో 78 మంది వృద్ధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గడికోట ట్రస్ట్ మేనేజర్ బాబ్జీ, ప్రతినిధులు గణేశ్, అపోలో ఫార్మసీ ప్రతినిధులు తదితరులున్నారు.

## ఆధ్యాత్మికం

### హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని ఎర్రాపహాడ్‌లో హన్‌మాన్ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ విగ్రహాన్ని జిల్లెడ ఆకులు, పువ్వులు, చంద్రంతో అందంగా అలంకరించారు. భిక్ష ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమం సమీపంలో ఉన్న హనుమాన్ భారీ విగ్రహం వద్ద కూడా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

**మైసమ్మ ఆలయంలో..**

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారంలో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. దీనిలో భాగంగా భక్తుల అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

**బేడీల మైసమ్మకు..**



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని గోర్గల్ గ్రామ శివారులోని బేడీల మైసమ్మ ఆలయంలో ఆదివారం మాగి గాయత్రి కార్మాగారం వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావ్ ప్రత్యేక పూజలు చేశారు. గాయత్రి కార్మాగారం నందు చెరుకు క్రషింగ్ జరుగుతుండటంతో మైసమ్మ తల్లికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట కేన్ మేనేజర్ వెంగల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**నృసింహుడి ఆలయంలో..**

మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నృసింహాస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు, జూనియర్ అసిస్టెంట్లు సంతోష్, లక్ష్మణ్,అర్చకులు ఉన్నారు.



**ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం**



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని మాల్తుమ్మెదలో ఆదివారం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీంతో పాటు 108 మంది బ్రాహ్మణ దంపతుల చేత సాముహిక సత్యనారాయణవ్రతాలు జరిపారు. వేదబ్రాహ్మణుడు దిగంబర శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణాల మధ్య స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అన్నదానం చేశారు.

**నెమ్లి సాయిబాబా ఆలయానికి పాదయాత్ర**



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రం నుంచి 500 మంది భక్తులు ఆదివారం నెమ్లిలోని సాయిబాబా ఆలయానికి పాదయాత్రతో తరలివెళ్లారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బోశివార్ ప్రకాశ్ ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర ప్రారంబించారు. ప్రతి ఏడాది నెమ్లి ఆలయానికి పాదయాత్రతో వెళ్తున్నామని భక్తులు తెలిపారు.

## సంక్షిప్తం

**వాహనాల తనిఖీ**

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండల కేంద్రంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. పలు వాహనాలకు జరిమానాలు విధించారు. తనిఖీల్లో ఏఎస్సై సంజీవులు, కానిస్టేబులు, హోంగార్డులు పాల్గొన్నారు.

**సెల్‌ఫోన్ అందజేత**

పిట్లం(జుక్కల్): మండల కేంద్రమైన పిట్లం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై విజయ్ కొండ ఆదివారం పోగుట్టుకున్న నాలుగు సెల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్సై లింబాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

**ముగిసిన గ్రామాభివృద్ధి కమిటీ పదవీకాలం**

భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ పదవీకాలం ముగిసిందని మాజీ సర్పంచ్ గుండ రేణుకారాజు, గ్రామాభివృద్ధి కమిటీ డైరెక్టర్ రాజులు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కమిటీ పదవీకాలం ముగిసిందని సర్పంచ్ ఎన్నికల తర్వాత నూతనంగా గ్రామాభివృద్ధి కమిటీని ఎన్నుకుంటామన్నారు.

**పంచాయతీ కార్యదర్శుల బదిలీ**

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని ఆరేపల్లి, గున్కుల్, సుల్తాన్‌నగర్,అచ్చంపేట, గోర్గల్, తున్కిపల్లి జీపీ కార్యదర్శులను కలెక్టర్ బదిలీ చేశారు. ఆరేపల్లి కార్యదర్శి అంజయ్య గున్కుల్ జీపీకి, గున్కుల్ కార్యదర్శి రవీరాథోడ్ సుల్తాన్‌నగర్‌కు, సుల్తాన్ నగర్ కార్యదర్శి అంబయ్య అచ్చంపేటకు, అచ్చంపేట కార్యదర్శి మోహన్ గోర్గల్‌కు, గోర్గల్ కార్యదర్శి వెంకట్రాంరెడ్డి తున్కిపల్లికి, తున్కిపల్లి కార్యదర్శి మతిన్ మహమ్మద్‌నగర్ గ్రామ పంచాయతీకి బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

**అసెంబ్లీ కోఆర్డినేటర్ నియామకం**

బిచ్కుంద(జుక్కల్) : కాంగ్రెస్ పార్టీ యువజన రాష్ట కార్యదర్శి దడ్గి భాస్కర్‌రెడ్డిని జుక్కల్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా రాష్ట్ర నాయకులు నియమించినట్లు జరిగిందని మండల అధ్యక్షుడు గంగాధర్ తెలిపారు.

**బీమా చెక్కు అందజేత**

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని పుల్కల్ గ్రామంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించి బీఆర్ఎస్ కార్యకర్త శంకర్ కుటుంబానికి ఆదివారం మాజీ ఎమ్మెల్యే బీమా చెక్కును అందించారు. పార్టీనుంచి బీమా చేసిన కారణంగా ఆయన కుటుంబానికి రూ. 2 లక్షల చెక్కును అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజు పటేల్, నాయకులు రాజు,భూంషెట్టి, వెంకట్‌రావు, సంతోష్ పాల్గొన్నారు.

**డిప్యూటీ సీఎంకు సన్మానం**

బాన్సువాడ : సామాజిక ఆశయ సాధన వ్యవస్థాకులు సందుల గంగారం ఆదివారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్కను కలిసారు. వచ్చే బడ్జెట్ సమావేశంలో ఎస్సీల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. డిప్యూటీ సీఎంను ఘనంగా సన్మానించారు.

**బీఆర్ఎస్‌కు ఎంపీటీసీ రాజీనామా**

నిజాంసాగర్(జుక్కల్): మండంలోని అచ్చంపేట గ్రామ ఎంపీటీసీ చాకలి సుజాత రమేష్ బీఆర్ఎస్ పార్టీ ప్రాథ మిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మనోహర్ అరాచకాలు, వ్యవహర శైలి నచ్చకపోవడంతోనే బీఆర్ఎస్ పార్టీకి దూరం అవుతున్నట్లు ప్రకటించారు. త్వరలోనే మరో పార్టీలో చేరే నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారు.